ప్రజాశక్తి
ఆదివారం 3 డిసెంబర్ 2023 5
అనంతపురం

ఖేలో ఇండియా పారాగేమ్స్‌కు ముగ్గురు ఎంపిక

పారాగేమ్స్‌కు ఎంపికైన విభిన్న ప్రతిభావంతులు

అనంతపురం కలెక్టరేట్ : ఢిల్లీలో జెఎ ల్‌ఎన్ స్టేడియంలో ఈనెల 10న నిర్వహిస్తున్న ఖేలో ఇండియా పారాగేమ్స్‌కు జిల్లాకు చెందిన విభిన్న ప్రతిభావంతులైన ముగ్గురు ఎంపికైనట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అనంతపురం అధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి ఎన్.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ విభిన్న ప్రతిభా వంతుల దినోత్సవం సందర్భంగా జిల్లా నుంచి వీరు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఎఫ్.56 విభాగంలో సాకే బాబు, టి.11 విభాగంలో నీలం పల్లవి, టి.11 విభాగంలో నీలం సంజయ్‌రెడ్డి ఎంపికయ్యారని తెలిపారు.

విగ్రహాల వివాదం

- మత విద్వేషాగ్ని రగిల్చేందుకు కొందరి యత్నం
- అనంతలో 'టిప్పుసుల్తాన్' చుట్టూ మత రాజకీయాలు
- కదిరిలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటులోనూ వివాదం

విగ్రహాల చుట్టూ వివాదాన్ని రాజే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అటు కదిరి, ఇటు అనంతపురం నగరంలో రెండు చోట్లా విగ్రహాల ఏర్పాటు వివాదానికి దారితీస్తోంది. విగ్రహాల ఏర్పాటుకు మతం రంగు పులుమేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా టిప్పసుల్తాన్ విగ్రహం ఏర్పాటు విషయంలో రెండు చోట్ల సమస్యాత్మకంగా మారుతోంది. కర్నాటకలోనూ గతంలో టిప్పసుల్తాన్ అంశంపై పెద్దఎత్తున వివాదాలు చెలరేగాయి. ఇప్పడు అనంతపురం జిల్లాకు విస్తరించే ప్రయత్నాలు ముమ్మరమైనట్టు కనిపిస్తున్నాయి. విగ్రహం ఏర్పాటు చేసి తీరుతామని కొంత మంది... పగులగొడతామంటూ మరికొంత మంది.. చేస్తున్న ప్రకటనలు వివాదాలకు ఆజ్యం పోసే విధంగా ఉన్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలో 20 శాతానికిపైగా ముస్లిం జనాభా ఉన్నా ఎప్పుడూ మతపరమైన ఇబ్బందులు తలెత్తిన దాఖలాల్లేవు. మత సామరస్యానికి ప్రతీకగా అనంతపురం నగరంలో ఉంటుంది. గుడి, మసీదులు పక్కపక్కనే ఉన్నా కలసిమెలసి పోతుండటం ఇక్కడి ప్రత్యేకత. ఇటువంటి చోట విగ్రహం ఏర్పాటుపై స్థానికంగా అందరూ కలసి కట్టుగానే ముందుకొస్తున్న తరుణంలో బిజెపి నేతలు ఏర్పాటును అడ్డుకుంటామని ప్రకటనలు చేయడం కొంత ఆందోళనకు గురిచేస్తోంది. అదే సమయంలో రైల్వేస్టేషన్ సమీపంలో ఛత్రపతి శివాజీ విగ్రహన్ని కొంతమంది ఏర్పాటు చేస్తున్నారు. రెండింటినీ నగరవాసులు స్వాగతిస్తున్నారు. ఈ నేపథ్యంలో టిప్పువిగ్రహం ఏర్పాటుపై వస్తున్న వివాదానికి పుల్‌స్టాప్ పెట్టే విధంగా అందరితో కలిపి అనంతపురం నగరంలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అందరి అభిప్రాయాలు, మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో ఏ మేరకు సానుకూలత వస్తుందన్నది చూడాల్సి ఉంది. అటు సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోనూ టిప్పుసుల్తాన్ విగ్రహం ఏర్పాటుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. దీనికి వ్యతిరేకంగానూ బిజెపి నేతలు ప్రకటనలు చేస్తున్నారు. అక్కడే శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ఏర్పాటు అంశం కూడా వివాదాస్పదమైంది. శ్రీ కృష్ణదేవరాయల విగ్రహం ఏర్పాటుకు అనుమతుల్లేకుండా రహదారిలో పిల్లర్లను ఏర్పాటు చేస్తున్నారని ఫిర్యాదు చేయడంతో కొంత మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కదిరి పట్టణం ముందు నుంచి సున్నితమైన ప్రాంతంగా ఉంది. గతంలో పలుమార్లు ఘర్షణలకు దారితీసిన ఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. విగ్రహాల ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇకపోతే విగ్రహాలు ఏర్పాటు చేయడానికి కొన్ని విధి విధానాలున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుంది. స్థానిక సంస్థల అనుమతులు తప్పనిసరిగ ఉండాలి. అదే విధంగా జిల్లా కలెక్టర్ అనుమతులూ తీసుకోవాల్సి ఉంటుంది. ఇవన్నీ పూర్తయితేనే విగ్రహాలు ఏర్పాటు సాధ్యమవుతుంది. పైరెండు చోట్ల కూడా ఏ మేరకు అనుమతులు తీసుకున్నారన్న చర్చ కూడా నడుస్తోంది. అధికారిక అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేసి ఎన్నికల సమయంలో వివాదాన్ని చేయడం సరైంది కాదని మేధావులు సూచిస్తున్నారు.

సామాన్యుల బ్యాంకుల ఖాతాలే లక్ష్యం చేసుకుని సైబర్ నేరగాళ్లు నగదును దోచేస్తున్నారు. నిరక్షరాస్యులు, అక్షరాస్యులు, నిరుద్యోగులు ఉద్యోగులు అని తేడా లేకుండా అందరినీ సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారు. సులువుగా నగదు లావాదేవీలు జరపాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఖాతాదారుల సేవా కేంద్రాలకు అనుమతిని ఇచ్చింది. ఖాతాదారులు బయోమెట్రిక్ ద్వారా ఖాతాదారుల సేవా కేంద్రంలో నగదు లావాదేవీలు జరుపుతున్నారు. ఇక్కడే సైబర్ నేరగాళ్ల మోసానికి తెరలేపుతున్నారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని మోసానికి పాల్పడుతున్నారు. హ్యాకర్లు ఖాతాదారుల డేటాను హ్యాక్ చేస్తూ నగదును మాయం చేస్తున్నట్లు పలువురు చెబుతున్నారు.

పేట్రేగుతున్న సైబర్ నేరగాళ్లు

- సామాన్యులే లక్ష్యంగా నగుదు దోపిడీ
- అకౌంట్లో సొమ్ము ఖాళీ
- నేరగాళ్లకు పడని అడ్డుకట్ట

సైబర్ మోసంపై ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు రామాంజనేయులు

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి మండల వ్యాప్తంగా ఇటీవల దాదాపు 70 మంది ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్ల నగదును దోచేసినట్లు బాధితులు చెబుతున్నారు. వన్నెదొడ్డికి చెందిన డాక్యుమెంట్ రైటర్ సుంకన్న బ్యాంకు ఖాతా నుంచి 10 పర్యాయాలు రూ.10 వేలు చొప్పున రూ.లక్షను సైబర్ నేరగాళ్లు దోచేశారు. పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన గ్రానైట్ బండల వ్యాపారి ఎం.రామాంజనేయులు భార్య ఎం.లక్ష్మిదేవి ఎస్‌బిఐ ఖాతా నుంచి గత నెలలో ఐదు పర్యాయాలలు రూ.10వేలు చొప్పున మొత్తం రూ.50వేలు నగదును సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. పట్టణానికి చెందిన డాక్యుమెంటు రైటర్లు రవి, అనంత వెంకటరమణ, రంగస్వామిలు బ్యాంకు ఖాతాల నుంచి రూ.10వేలు చొప్పున నేరగాళ్లు దోచేశారు. జెండా వీధికి చెందిన సిరాజుద్దీన్ ఖాతా నుంచి రూ.4,600, వన్నెదొడ్డి గ్రామానికి చెందిన లక్ష్మి నారాయణ ఖాతా నుంచి రూ.30వేలు, శ్రీనివాస్ యాదవ్ బ్యాంకు ఖాతా నుంచి రూ.20వేలు, ఆంజనేయులు ఖాతా నుంచి రూ.20వేలు, రియల్ వ్యాపారి గోవిందు ఖాతా నుంచి రూ.10వేలు, మల్లయ్య నుంచి రూ.10వేలు నగదును సైబర్ నేరగాళ్లు అపహరించారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాలు గ్రామీణ ప్రాంతాల్లోని బ్యాంకు ఖాతాదారుల ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బును దోచుకున్నారు. పలువురు బాధితులు బ్యాంకర్లతో గొడవకు దిగారు. మరికొంత మంది పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్థిరాస్తులకు సంబంధించి క్రయ,విక్రయాలు జరిపిన వారినే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్నట్లు బ్యాంకర్లు, పోలీసులు చెబుతున్నారు. తమకు ఏమాత్రం సంబంధం లేదని సబ్ రిజిస్ట్రార్ అంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఖాతాలనుంచి పోయిన తమ సొమ్ముకు ఎవరు బాధ్యత వహిస్తారని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి సైబర్ నేరగాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

ఎం ఆధార్‌తో ఖాతాలో సొమ్ముకు భద్రత

సైబర్ నేరగాళ్లు అధిక శాతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు వివిధ ప్రాంతాల్లో బ్యాంకు ఖాతాదారుల ఆధార్, డేటాను హ్యాక్ చేస్తూ నకిలీ వేలి ముద్రలు (సింథటిక్ వేలిముద్రలు) తయారు చేసుకుని నేరాలకు పాల్పడుతున్నట్లు తమకు సమాచారం వచ్చింది. ఖాతాదారుల కేంద్రాల్లోని ఎఇపిఎస్ ద్వారా సైబర్ నేరగాళ్లు ఖాతాదారుల ఖాతా నుంచి నగదును దోచేస్తున్నారు. బాధితుల నుంచి సమాచారాన్ని సేకరించి సైబర్ క్రైమ్‌కు పంపిస్తాం. బాధితు లందరికీ పోయిన సొమ్ము వచ్చేలా చూస్తున్నాం. ప్రతి ఒక్కరు తమ మొబైల్లలో ఎం ఆధార్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని బయోమెట్రిక్‌ను లాక్ చేసుకోవాలి. ఎం ఆధార్ యాప్ ద్వారా ఖాతాదారుల బ్యాంకు ఖాతాలోని నగదుకు భద్రత ఉంటుంది.

నబీరసూల్, ఎస్ఐ, గుత్తి.

ఆందోళన చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలో దశాబ్దాల కాలంగా మూతబడిన స్పిన్నింగ్ మిల్లులో ప్రత్యామ్నాయ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) జిల్లా కమిటీ సభ్యుడు సురేంద్ర, పట్టణ అధ్యక్షుడు మద్దికెర ప్రతాప్, ప్రధాన కార్యదర్శి దాసరి చరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని గుత్తి రోడ్డులో మూతబడిన స్పిన్నింగ్ మిల్లు ఎదుట డివైఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన స్విమ్మింగ్ మిల్లుకు ఎంతో చరిత్ర ఉందన్నారు. అలాంటి పరిశ్రమను పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఎంతోమంది కార్మికులకు ఉపాధి కలిగించే మిల్లును 1991లో మూసివేశారన్నారు. అప్పటి నుంచి ఉపాధి లేక యువతీ, యువకులు, కార్మికులు ఇతర రాష్ట్రాలకు ఉపాధి కోసం వలసలు వెళ్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మూతపడిన స్పిన్నింగ్ మిల్లులో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు మురళి, గోవిందు, బాషా, ప్రసాద్, కిషోర్, పునీత్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని వివరించేందుకే బస్సుయాత్ర

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-గుంతకల్లు

సిఎం జగన్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసింది చెప్పడానికే వైసిపి ప్రభుత్వం సామాజిక సాధికార బస్సుయాత్ర చేపట్టిందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఈనెల 9న నియోజకవర్గంలో జరుగనున్న సామాజిక సాధికార బస్సుయాత్ర సభా ప్రాంతాన్ని శనివారం ఎంపీ తలారి రంగయ్య, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని, వైస్ ఛైర్‌పర్సన్లు మైమున్, నైరుతిరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ రామలింగప్పలతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దిరెడ్డి మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనార్టీ వర్గాలకు అమలు చేసిన సంక్షేమ పథకాలు చెప్పాడానికే ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక సాధికార బస్సుయాత్ర చేపట్టిందని అన్నారు. గుంతకల్లు నియోజక వర్గంలో ఆరు కిలోమీటర్ల బస్సుయాత్ర చేపట్టి పట్టణంలోని వైఎస్ఆర్ కూడలిలో సభ ఏర్పాటు జరపాలని నిర్ణయించామని అన్నారు. ఈ బస్సుయాత్ర జయప్రదం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

బస్సుయాత్ర స్థల పరిశీలన

రాయదుర్గం : ఈనెల 5న రాయదుర్గంలో తలపెట్టిన బస్సుయాత్ర ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా తేరు వీధిలో సభ ఏర్పాటుకు అనువైన స్థలం ఉందని, ఇందుకు తగ్గట్టుగా అవసరమైన చర్యలు చేపట్టాలని విప్ కాపు రామచంద్రారెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీ తలారి రంగయ్య, విప్ కాపు రామచంద్రారెడ్డి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు బోయ గిరిజమ్మ, ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళు శిల్ప, మహాలక్ష్మి శ్రీనివాస్, స్థానిక వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మ్-7ను బల్క్‌గా ఇస్తే తీసుకోవద్దు..

- దీనిపై ఎన్నికల సంఘం మార్గదర్శకాలున్నాయి..
- ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



ప్రజాశక్తి-అనంతపురం

ఫార్మ్-7ను బల్క్‌గా ఇస్తే తీసుకోకూడదని, ఏదైనా ఉంటే ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల సంఘం చెప్పిందని ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తెలిపారు. అనంతపురం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో అధికార పార్టీ చేస్తున్న అక్రమాలపై తాను అనేక రోజులుగా పోరాటం చేస్తున్నానని చెప్పారు. ఈ పోరాట ఫలితంగా ఎన్నికల సంఘం డిసెంబరు 1వ తేదీన ఫార్మ్-7ను బల్క్‌గా తీసుకునే విషయంపై మార్గదర్శకాలు ఇచ్చిందని చెప్పారు. ఆన్‌లైన్‌లోనే ఫార్మ్-7 తీసుకోవాలని చెప్పిందని వివరించారు. ఉరవకొండలో ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడుతున్నది మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డే అని ఆరోపించారు. ఆయన తనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎవరి ఓటు ఎక్కడుండాలన్నది ఆ ఓటరు నిర్ణయించుకునే అధికారముందని చెప్పారు. అలా ఉండాలని కూడా తాను కోరుకుంటున్నట్టు తెలిపారు. ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడింది ఆయన అని చెప్పారు. దీనికి మూల్యం అధికారులు చెల్లించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. తను బ్లాక్ మెయిల్ చేసే వాడిని కాదని, ఏదైనా ఉంటే వైట్ మెయిల్‌యే చేస్తానని తెలిపారు. విశ్వేశ్వరెడ్డి అధికారులపై ఒత్తిడి పెంచి ఒక వర్గం ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అధికారులు ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకోవాలని మాత్రమే తాను కోరుతున్నానని చెప్పారు.

ఎస్‌కెయు భూములను కాపాడాలి

ఏడీ బిల్డింగ్ ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా

ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వైసిపి నాయకులు కబ్జా చేసిన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి చెందిన ఐదెకరాల భూమిని కాపాడటంతోపాటు కబ్జాదారులపై కేసు నమోదు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎస్కుయు ఏడీ భవనం వద్ద విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు పులిరాజు మాట్లాడుతూ యూనివర్సిటీ అధికారుల అనుమతి లేకుండా యూనివర్సిటీలోకి చొరబడి కంచె వేసిన వైసిపి నాయకులపై కేసు నమోదు చేయాలన్నారు. ప్రయివేటు వ్యక్తుల నుంచి కొనుగోలు చేసిన భూమిలో జగనన్న లేఅవుట్ వేయాలి తప్ప, వర్శిటీ భూమిని కబ్జా చేస్తే ఎలా అని ప్రశ్నించారు. 500 ఎకరాల యూనివర్సిటీ భూమి ఉంటే దానిలో ఐదు ఎకరాల భూమిని జగనన్న లేఅవుట్ పేరుతో పేదలకు ఇల్లు స్థలాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. యూనివర్సిటీలో మూడు సంవత్సరాల పరిపాలన చేసిన గత వైస్ ఛాన్సలర్ రామకృష్ణారెడ్డి మూడేళ్లలో స్థలంపై ఏమాత్రం నోరు మెదపకుండా పదవీ విరమణ రెండు రోజులు ఉన్న సమయంలో ఇలా జగనన్న లేఅవుట్‌కు అనుమతి ఇవ్వడం సరైంది కాదన్నారు. ఆరు నెలల క్రితమే ఇదే అంశంపై ఈసీ మీటింగ్‌లో ప్రతిపాదన పెడితే దాన్ని తిరస్కరించారని గుర్తు చేశారు. తక్షణమే విశ్వవిద్యాలయానికి సంబంధించిన భూమిని బయట వ్యక్తులు ఎవరు ఆక్రమించుకోకుండా దానిపైన విచారణ చేపట్టాలన్నారు. ఎవరైతే యూనివర్సిటీ అధికారుల అనుమతి లేకుండా ఫెన్సింగ్ వేశారో వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు శివ, గిరి, సిద్ధు, భీమేష్, వంశీ, శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు వేమన్న, జిల్లా అధ్యక్షులు రమణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు వంశీ నాయక్, నగర అధ్యక్షులు ఉమా మహేష్, ఆనంద్, ప్రసన్న, పాల్గొన్నారు.

కబ్జా చేసిన వారిని శిక్షించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎస్కెయుకు చెందిన విలువైన ఐదెకరాల భూమిని కబ్జా చేసిన వారిని వెంటనే శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఘటనపై కలెక్టర్‌తోపాటు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పందించాలనానరు. వెంటనే దౌర్జన్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇందుకు సహకరించిన మాజీ విసిపై సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు. రూరల్ మండలంలో యూనివర్శిటీ భూమిని యథేచ్చగా ఆక్రమించుకుంటుంటే తహశీల్దార్ తన దృష్టికి రాలేదని ప్రకటించడం బాధ్యతా రాహిత్యమన్నారు. పేదలు ఎక్కడైనా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటే వందలమంది పోలీసులను పంపి వాటిని కూలగొట్టించే జిల్లా ఉన్నతాధికారులు యూనివర్శిటీ స్థలం ఆక్రమణ అవుతుంటే మౌనంగా ఉండడానికి కారణం ఏంటని ప్రశ్నించారు. ఆక్రమణకు గురైన ఐదెకరాల యూనివర్శిటీ స్థలాన్ని వెంటనే యూనివర్శిటీకి స్వాధీనం చేయించాలని డిమాండ్ చేశారు. కబ్జాకు గురౌతున్న యూనివర్శిటీ ఆస్తులపై మేధావులు, విద్యావంతులు స్పందించాలని కోరారు.

బారులుదీరిన 'జిందాల్' వాహనాలు

ట్రాఫిక్‌కు తీవ్ర సమస్య - పట్టించుకోని అధికారులు

పోలీస్‌స్టేషన్ ముందు ఆగిన వాహనాలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని హరేసముద్రం రెవిన్యూ పరిధిలో ఉన్న జిందాల్ ఫ్యాక్టరీకి సంబంధించిన భారీగా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నుంచి హెచ్ఎల్‌సి వరకూ దాదాపు కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పొలాలకు వెళ్లే ట్రాక్టర్లు, బస్సులు గంటల తరబడి వాహనాలు ఆగిపోయాయి. దీంతో వృద్ధులు, వికలాంగులు, ప్రయాణికులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. కాగా మండల కేంద్రంలో జిందాల్ వాహనాల రద్దీ తగ్గించాలని స్థానికులు పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రం సమీపంలో బైపాస్ ఏర్పాటు చేసుకుని భారీ వాహనాలను అక్కడ మళ్లిస్తే మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఉండదు. అంతేగాకుండా ప్రమాదాలను సైతం నివారించవచ్చని స్థానికులు వాపోతున్నారు. రోజుకు దాదాపు 1000 టిప్పర్లు తిరుగుతుండటంతోకిలోమీటర్ తరబడి వాహనాలు ఆగిపోతున్నాయి. దీంతో అంబులెన్స్ వచ్చినా దారి ఇవ్వలేని పరిస్థితి ఉంటోంది. అంతేగాకుండా గతంలో పని చేసిన శాతవాహన ఫ్యాక్టరీ యాజమాన్యం వారు ఇచ్చిన హామీ మేరకు రహదారికి ఇరువైపులా రెండు పూటలా నీటిని పిచికారి చేయాలి. దీంతో దుమ్మూధూళి లేకుండా పోతుంది. ప్రస్తుతం ఉన్న జిందాల్ యాజమాన్యం అలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. తద్వారా దుమ్మూధూళితో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించడంతోపాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

పాలస్తీనాలో శాంతిని నెలకొల్పాలి

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పాలస్తీనాలో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ సిపిఎం అనుబంధ విద్యార్థి, ప్రజా సంఘాలు శనివారం పట్టణంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, ఐద్వా పట్టణ కార్యదర్శి రంగమ్మ, ఆవాజ్ కమిటీ నాయకులు అబ్దుల్లా, డివైఎఫ్ఐ నాయకులు సురేంద్ర మాట్లాడుతూ పాలస్తీనాలో శాశ్వత శాంతి నెలకొనాలంటే ఇజ్రాయెల్, హమాస్ సహా పాలస్తీనియన్ల సార్వభౌమత్వాన్ని అంగీకరించాలని నిపుణులు భావిస్తున్నారన్నారు. గాజా నిర్బంధానికి ముగింపు పలకాలని వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలెంలో ఆంక్షలు ఎత్తివేయాలన్నారు. శాశ్వత శాంతి కోసం పాలస్తీనియన్లు హింసను విడిచిపెట్టాలని ఇజ్రాయెల్‌ను అంగీకరించాలన్నారు. సరిహద్దులు, యూదుల సెటిల్‌మెంట్లు, పాలస్తీనా శరణార్థులు స్వదేశానికి తిరిగి రావడం మొదలైన అంశాలపై రెండుపక్షాలూ ఆమోదయోగ్యమైన ఒప్పందాన్ని కుదుర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చరణ్, వెంకీ, ఐద్వా పట్టణ అధ్యక్షురాలు జ్యోతి, డివైఎఫ్ఐ నాయకులు ప్రతాప్, చొక్కా సునీల్, ఆవాజ్ పట్టణ నాయకులు మస్తాన్, షాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

'సూపర్‌స్పెషాలిటీ'లో మైక్రో బయాలజీ కల్చర్ పరీక్షలు

ల్యాబ్‌లో వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని రోగులకు సూక్ష్మజీవుల వ్యాధి నిర్ధారణ కల్చర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.మాణిక్యరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రిలోనే మైక్రో బయాలజీ విభాగంలో బ్యాక్టీరియా, ఫంగస్ కల్చర్ పరీక్షలు, ఆపరేషన్ థియేటర్స్ శ్వాబ్స్ కల్చర్స్ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. వీటికి సంబంధించిన అన్ని సదుపాయాలనూ మైక్రోబయాలజీ ల్యాబ్‌లో సమకూర్చామన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగాధిపతి శాంతిరెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆర్ఎంఒ సుభాష్ చంద్రబోస్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ సౌజన్యకుమార్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్లు రవితేజ, భాస్కర్, రవికుమార్, హైమావతి, సరోజ, శైలజ, ఉమాదేవి, చంద్రశేఖర్, ప్రవీణ, ప్రియాంక, రత్న హారిక, సునీల్‌కుమార్, ఆదిరెడ్డి పరదేశీనాయుడు, టెక్నీషియన్లు విజయలక్ష్మి, ఉష, భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక మద్యం, ఇసుక రవాణాపై ఉక్కుపాదం : ఎస్పీ

అనంతపురం క్రైం : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాలు మేరకు సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ పర్యవేక్షణలో ఇతర రాష్ట్రాల మద్యం, ఇసుక అక్రమ రవాణాలపై గతనెలలో ఉక్కుపాదం మోపినట్లు ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నాటుసారా తయారీ, నిల్వ, అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా ఉంచామన్నారు. ఇందులో భాగంగా 26,753 టెట్రా పాకెట్లు, నాటు సారా తయారీకి ఉపయోగించే 3,065 లీటర్ల బెల్లంఊట ధ్వంసం చేశారు. 190 లీటర్ల నాటుసారా, 482 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారన్నారు. కర్నాటక నుంచి జిల్లాలోకి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వారిపై 169 కేసులు నమోదు చేసి 197 మంది నిందితులను అరెస్టు చేశారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 9 కేసులు నమోదు చేసి 16 మందిని అరెస్టు చేశారన్నారు. ఇక ఇసుక అక్రమంగా తరలిస్తున్న 14 వాహనాలు సీజ్ చేసినట్లు వివరించారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం : జెసి అస్మిత్‌రెడ్డి

వృద్ధురాలితో మాట్లాడుతున్న జెసి అస్మిత్‌రెడ్డి

పెద్దపప్పూరు : టిడిపి అధినేత చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ జెసి అస్మిత్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలం పరిధిలోని తిమ్మనచెరువులో 'బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అస్మిత్‌రెడ్డి సొంతూరు జూటూరు గ్రామం నుంచి బైక్ ర్యాలీగా తిమ్మనచెరుకు చేరుకున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శశిధర్‌రెడ్డి, పసులూరు సర్పంచి శ్రీనివాసులునాయుడు, యువ నాయకులు లోకనాథ్‌రెడ్డి, టిడిపి కన్వీనర్ రఘు, చిక్కేపల్లి శివారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పెద్దిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సింగనగుట్టపల్లి ఆది, గంగరాజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి, అనంతపురం వారి కోర్టులో

G.W.O.P. NO:77/2023

Between:

1.N.సురేష్ బాబు S/o సుబ్రమణ్యం,
2.N.రమాదేవి W/o సురేష్ బాబు, ఇద్దరి నివాసం D.No:9-80, మెయిన్ బజారు తాడిపత్రి టౌన్, అనంతపురం జిల్లా ...పిటిషనర్స్

ఎదిరి

Nil ...రెస్పాండెంట్లు

బహిరంగ ప్రకటన

పై అర్జీలో అర్జీదారులు తాము మైనరు అమ్మాయి అయిన సి.వి.నాగవైష్ణవికి సంరక్షకులుగా ఉండుటకు అనుమతించ వలసినదిగా కోరుతూ పై అర్జీ దాఖలు చేసి యున్నారు. పై అర్జీలో ఎవరికైనా అభ్యంతరములున్న యెడల 22/12/2023 న పై కోర్టు వారి ఎదుట ఉదయం 10:30 ని॥లకు స్వయంగా గాని వకీలు ద్వారా కాని హాజరై అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. లేని యెడల పై కోర్టు వారు తమ ముందు వున్న రికార్డులను అనుసరించి తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

సి.సురేంద్రనాథ రెడ్డి,
న్యాయవాది అనంతపురం.
కె.శంకర రెడ్డి,
న్యాయవాది తాడిపత్రి.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT COURT-ANANTAPURAMU

G.O.P. NO, 68/2023

Between:

Indu Vijay Mode W/o Late Vijay Mode, Hindu, Age 51 years, Homemaker, D No. 2/212, Kundanagurthi (V), Chippagiri (M) Kurnool Dist. ...Petitioner

AND

NIL... ...Respondents

GENERAL NOTICE

పై దావాలో పిటిషనర్ దాఖలు చేసుకున్న అర్జీ ఏమనగా, మైనర్ ఆర్తి విజయ్ మోడి ను ఉన్నత చదువులు చదివించుటకు గాను మరియు ఆమె బాగోగులను చూచుకొనుటకు గాను, ఇందులో కనబరిచిన షెడ్యూలు ఆస్తిలో మైనర్ ఆర్తి విజయ్ మోడికు చెందిన 1/6 భాగము షెడ్యూల దాఖలా ఆస్తిని అమ్ముటకు పర్మిషన్ మంజూరు చేయుదురని పై కోర్టులో దావా పిటీషన్ దాఖలు చేసుకున్నారు. కావున ఎవరికైనా ఆక్షేపణలు వున్న యెడల తేది:15/12/2023న ఉదయం 10o30 గంటలకు ఖుద్దున గానీ, లేక వకీలు ద్వారా గానీ పై కోర్టు నందు హాజరై తెలియజేయవచ్చును.

SCHEDULE

Vacant site in plot No. 9 to an extent of 200 Sq. Yards in Survey No.279/A1. 283/B, 284/D2 of Thimmanacherla Vilage Polam of Guntakal Municipal Area on Northern side of V.V.Nagar Residential Area in New Ward No.10, Present Ward No. 12, within RD of Ananthapuramu and SRD of Guntakal.

Measurement:
East to West : 60 feet, North to South :30 feet. Total : 200 Sq. Yards.

Boundaries: East :33 feet Road West : Plot No. 7 North Plot No. 8 South : 33 feet Road

తేది: 15-12-2023

(By order of the Court)
P. VENKATA NAIDU, Advocate,
Guntakal, Cell No. 7780432231

అర్హతకు తగ్గ 'ఉపాధి'కి ప్రయత్నం చేయాలి

జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు అర్హతకు తగ్గ ఉపాధి అవకాశాలకు వెళ్లాలని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వర్సిటీ ఆడిటోరియంలో కర్నూలు ఎపి గవర్నమెంట్ రీజినల్ ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో అనంతపురం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు 'కేరీర్ కాన్ఫరెన్స్ ఆన్ ప్రిపరేషన్ ఫర్ కాంపిటేటివ్ ఎక్సమినేషన్స్' విషయంపై ఒక్కరోజు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యని చదువుకుంటూ సరైన అవగాహనతో ఏ ఉద్యోగాలకు అర్హతలు ఉన్నాయో తెలుసుకుని సిద్ధంగా ఉండాలని సూచించారు. డిగ్రీ అర్హతకు తగ్గ ఉద్యోగాలకు వెళ్లాలేగానీ, అంతకంటే తక్కువ ఉద్యోగాలకు వెళ్లకూడదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రప్రథమంగా సన్నద్ధం కావడానికి ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. రెక్టార్ ఎం.విజయకుమార్ మాట్లాడుతూ మీ లక్ష్యం నిర్దేశించుకుని దానికి తగ్గట్టుగా కష్టపడి ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కెరియర్ పట్ల చదువుతున్నప్పుడే అవగాహన పెంచుకోవాలని, అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలిపారు. నోటిఫికేషన్ విడుదల అయినప్పుడు దానికి తగ్గట్టుగా ప్రిపరేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, కర్నూలు రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ పి.ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ ఇ.అరుణకాంతి, వర్సిటీ ఫారిన్ అఫైర్స్ డైరెక్టర్ పి.సుజాత, మాజీ ఆచార్యులు వి.శంకర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎ.పి.శివకుమార్, కళాశాల నుంచి ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, ఎం.అంకారావు, కళ్యాణి రాధ, దిలీప్‌కుమార్, అజిత, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

ప్రభుత్వ భూములను కాపాడాలి

తహశీల్దార్‌కు సిపిఎం నాయకుల వినతి

తమశీల్దార్ ఉషారాణితో మాట్లాడుతున్న సిపిఎం, రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండలంలో అధికార పార్టీ నాయకుల భూదాహం నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఐదు రోజుల నుంచి సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన తహశీల్దార్ ఉషారాణి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో దీక్షలను విరమించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ ముకుందాపురం, కోటంక గ్రామాల్లో దళిత మహిళలపై దాడి చేసిన సూర్యచంద్రారెడ్డి, ఆదినారాయణను అరెస్టు చేయాలని, అదేగ్రామంలో సర్వే నెంబర్ 243-1, పెనకచెర్ల గ్రామంలో పేదలు సాగు చేసుకున్న 20 ఎకరాలు, ఇల్లూరులో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ముకుందాపురం, కల్లూరు గ్రామాలలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కోటంకలో అధికార పార్టీకి చెందిన నాయకుడు ఎల్లారెడ్డి రెండెకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని మట్టి తరలించి రూ.లక్షలు దోచుకున్నా అధికారులు అటువైపు చూడలేదన్నారు. కల్లూరులో అధికార పార్టీకి చెందిన పిల్లల రామకృష్ణ ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో ఏకంగా వడ్ల మిషన్ నిర్మించారన్నారు. అదేవిధంగా పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఇద్దరు ఉన్నతాధికారులు పదెకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి బినామీ పేర్లతో పంటల సాగు చేసుకుంటున్నారన్నారు. వీటిని స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నాగమ్మ, రాయుడు, నల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

మూసుకుపోయిన శ్వాసనాళానికి శస్త్రచికిత్స

మహిళ ప్రాణాలు నిలబెట్టిన కిమ్స్ సవీరా వైద్యులు

చికిత్స వివరాలను వెల్లడిస్తున్న పల్మనాలజిస్టు డాక్టర్ యశోవర్ధన్

ప్రజాశక్తి-అనంతపురం,

వెంటిలేటర్ అమర్చడం వల్ల శ్వాసనాళం పూడిపోయి దాదాపు ఊపిరి అందని ఓ మహిళకు అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రికి చెందిన వైద్యులు అత్యవసరంగా శస్త్రచికిత్స చేసి ప్రాణాలు నిలబెట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆసుపత్రికి చెందిన పల్మనాలజిస్టు డాక్టర్ యశోవర్ధన్ తెలిపారు. అనుకోకుండా విషం మింగడంతో 30 ఏళ్ల వయసున్న మహిళకు బెంగళూరులోని ఆసుపత్రిలో వెంటిలేటర్ అమర్చారు. దాదాపు వారంరోజుల పాటు వెంటిలేటర్ మీద ఉన్న తర్వాత పరిస్థితి అంతా బాగుండటంతో డిశ్చార్జి చేసి పంపేశారు. అక్కడి నుంచి వచ్చేసిన రెండు నెలల తర్వాత ఆమెకు ఊపిరి అందడం కష్టంగా మారింది. చివరకు కూర్చున్నా ఊపిరి అందని పరిస్థితి. గురక, దగ్గు బాగా ఎక్కువ కావడంతో కిమ్స్ సవీరా ఆస్పత్రికి వచ్చారు. ముందుగా ఆమె మెడకు ఎక్స్‌రే తీసి చూడగా శ్వాసనాళం బాగా మూసుకుపోయినట్లు గుర్తించారు. మరింత వివరంగా తెలుసుకోవడానికి బ్రాంకోస్కోపీ పరీక్ష చేసి గొంతులోకి కెమెరా పంపించి చూడగా 12 మిల్లీమీటర్ల మేర ఉండాల్సిన శ్వాసనాళం కేవలం 3 మిల్లీమీటర్లు మాత్రమే ఉండి, మిగిలినదంతా పూడిపోయింది. ఈ పూడిక వోకల్ కార్డ్స్‌కు 4 సెంటీమీటర్ల దిగువన ఏర్పడింది. దీంతో ఆమెకు అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించి, జనరల్ ఎనస్థీషియాతో శస్త్రచికిత్స ప్రారంభించి ఎలక్ట్రోకాటెరీ అనే విధానంలో పూడిపోయిన శ్వాసనాళానికి కోత పెట్టామన్నారు. దీంతో 6 మిల్లీమీటర్ల స్థాయికి చేరుకుంది. ఆ తర్వాత లోపలకు బెలూన్లు పంపి, వాటి ద్వారా శ్వాసనాళాన్ని మరింతగా వెడల్పు చేసి, 12 మిల్లీమీటర్ల స్థాయికి తీసుకొచ్చామన్నారు. ఈ శస్త్రచికిత్స తర్వాత ఆమెకు ఊపిరి సాధారణంగా అందడంతో పాటు, దగ్గు, గురక కూడా తగ్గడంతో డిశ్చార్జి చేసినట్లు వివరించారు.

'సామాజిక సాధికార సభ'ను జయప్రదం చేయాలి

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 'సామాజిక సాధికార బస్సుయాత్ర సభ'ను ఈనెల 4న రాప్తాడుకు చేరుకోనున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రోడ్లు, భవనాలు అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సిఎం జగన్ ఆవిష్కరించారన్నారు. దేశంలో చాలా రాష్ట్రాల్లో బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన ముఖ్యమంత్రులు ఉన్నా వారెవరూ రాజ్యాంగాన్ని అమలు చేయని విధంగా రాజకీయంగా 80 శాతం ఆయా వర్గాలకే పెద్దపీట వేసిన ఘనత సిఎంకే దక్కుతుందన్నారు. 40 ఏళ్లుగా బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను మోసం చేసిన టిడిపి అగ్రవర్ణ పెత్తందారీ విధానాలను అమలు చేసేందుకు ఆయావర్గాలను కేవలం ఓటుబ్యాంకుగా మాత్రమే వాడుకుందని విమర్శించారు. ఇకపోతే తమన ఓడించిన వారికి లబ్ధి జరగకూడదనే ఎజెండా పెట్టుకున్న పరిటాల సునీత నియోజకవర్గ వ్యాప్తంగా చాలా గ్రామాల్లో నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా కోర్టుకు వెళ్లి స్టేలు తెచ్చి అడ్డుకున్నారన్నారు. కరోనా సమయంలో నియోజకవర్గ ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోని సునీత నాలుగేళ్ల విరామం తర్వాత ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో తిరుగుతూ కల్లబొల్లి మాటలు చెబుతోందన్నారు. వారి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ధనుంజయయాదవ్, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనంతలో 'అపోలో సర్కస్'



ప్రదర్శనలు చేస్తున్న యువతులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రుద్రంపేట సర్కిల్‌లో ఉన్న ఎగ్జిబిషన్ మైదానంలో నూతనంగా ఏర్పాటు చేసిన అపోలో సర్కస్ వీక్షకులను అబ్బుర పరుస్తోంది. ఈ సందర్భంగా అపోలో సర్కస్ అధినేత సనీల్ జార్జ్, మేనేజర్లు సర్కస్ సికిందర్ ప్రదీప్ ప్రజాశక్తితో మాట్లాడుతూ అనంతపురంలో మొట్టమొదటిసారిగా అపోలో సర్కస్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీక్షకులను అబ్బురపరిచే అనేక రకాల జిమ్నాస్టిక్ విన్యాసాలను జిమ్నాస్టిక్ విన్యాసాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా గ్లోబ్‌లో బైక్ రైడింగ్ అందర్నీ ఆకట్టుకుంటోందన్నారు. కత్తులతో చేసే విన్యాసాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. నవంబర్ 24 నుంచి అపోలో సర్కస్ ప్రారంభమైందని, దాదాపు నెలరోజులపాటు అనంతవాసులను అలరించబోతున్నట్లు వివరించారు. రోజూ మధ్యాహ్నం 1గంట, 4 గంటలకు, రాత్రి 7 గంటలకు షోలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎలక్షన్ ఫీవర్..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలకు సమయం ముంచుకొస్తుండటంతో అప్పుడే అంతటా ఎలక్షన్ ఫీవర్ మొదలైనట్టు కనిపిస్తోంది. అటు నేతలు, ఇటు రాజకీయపార్టీలు, కుల సంఘాల హడావుడి అంతా..ఇంతా ఉండటం లేదు. గత వారంలోనే తెలంగాణ ఎన్నికలు కూడా పూర్తయ్యి నేడు ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ ఎన్నికల ఫలితాలు ఏ రకంగా ఉంటాయి... ఆ ప్రభావం రాష్ట్ర రాజకీయాలపై ఏ రకంగా ఉంటుందన్న చర్చ సర్వత్రా నడుస్తోంది. ఇదే నేపథ్యంలో ఇక్కడ కూడా కొన్ని నెలల్లో ఎన్నికలు ఉండే అకవాశముండటంతో అప్పుడే అంతటా రాజకీయ హడావుడి మొదలైంది. ఓటర్ల జాబితాలతోపాటు, ఇవిఎంలను సిద్ధం చేసే పనిలో అధికార యంత్రాంగం ఉంది. అయితే ఓటర్ల జాబితాలో తప్పొప్పులు రాజకీయ వేడి రగులుస్తున్నాయి. అధికార పార్టీ ఒక పథకం ప్రకారం ప్రత్యర్థి ఓట్లను తొలగిస్తూ, అధికార పార్టీకి అనుకూలమైన ఓట్లను చేరుస్తున్నారని ప్రతిపక్ష టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు. ఇక అధికార పార్టీ కూడా వారే తప్పు చేస్తున్నారంటూ వైసిపి నాయకులు ప్రత్యారోపణలు చేస్తున్నారు. దీనిపై ఒకరిపై ఒకరు మీడియా సమావేశాలు పెట్టి మరీ విమర్శించుకుంటూ పోతున్నారు. ఇంకా ఎన్నికల కోడ్ కూడా రాకముందే ఎన్నికలు వచ్చేసాయన్నంతగా ఈ విమర్శలు, ప్రతి విమర్శలు నడుస్తున్నాయి. ప్రధానంగా ఉరవకొండ, రాప్తాడు, అనంతపురం, గుంతకల్లు తదితర నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితా రాజకీయ వేడిని రగులుస్తోంది. ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికలకు సమయత్తమయ్యే పనిలోనూ మరోవైపు నిమగ్నమై ఉన్నాయి.

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వనరులను సిద్ధం చేసుకుని ఎన్నికల రణరంగంలో దిగేందుకు అవసరమైన ప్రయత్నాల్లో నాయకులు తలమునకలై ఉన్నారు. ఇప్పటి నుంచే ఆయా పార్టీల్లో ఎన్నికల సందడి కనిపిస్తోంది. నేతలు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ల కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. తమకు అనుకూలంగా ఉంటుందంటే, తమకు అనుకూలమని చెప్పుకుంటున్నారు. అధిష్టానం మెప్పుకోసం ప్రదక్షిణలు మొదలుపెట్టారు. అనుమానం ఉన్న వారు ఏ మార్గంలో పయనిస్తే బాగుంటుందని దారులు వెతుక్కునే పనిలోనూ ఉంటున్నారు. దీని కోసం తమ అనుయాయులతో మంతనాలు, సంప్రదింపులు నడుస్తున్నాయి. ఆదివారం నాడు వెలువడే తెలంగాణ ఎన్నికల ఫలితాలను బట్టి నిర్ణయం తీసుకుందామన్న ఆలోచనలు చేసుకుంటున్నారు.

కులసంఘాల సమావేశాలు

ఎన్నికల సీజన్ కావడంతో కుల సంఘాల సమావేశాలు ముమ్మరమయ్యాయి. కురుబ, బోయ, వడ్డేర, కాపుబలిజ ఇలా అన్ని కులాలు తమ బలాన్ని ఎన్నికల ముందు ప్రదర్శించే ప్రయత్నాలు చేసుకుంటుయి. ఇదివరకే బోయ, కురుబ కులాలు సభలు నిర్వహించాయి. ఈ వారంలో కాపు సామాజిక వర్గం వనబోజనాల పేరుతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తోంది. కుల సంఘాల మద్దతు కూడగట్టి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్టు సాధించుకోవాలని భావిస్తున్న నేతలు కనిపిస్తున్నారు. రాజకీయ పార్టీలు కూడా అందుకు అతీతంగా కనిపించడం లేదు. ఇప్పటికే వైసిపి సామాజిక చైతన్య యాత్ర పేరుతో బస్సు యాత్రను చేపడుతోంది. ఉమ్మడి జిల్లాలో ఈ యాత్రలు ఈ వారంలో మరిన్ని ఎక్కువ పెట్టబోతోంది. టిడిపి బీసీ, ఎస్సీ,మైనార్టీల సదస్సులు నిర్వహిస్తోంది. ఇలా ఎన్నికల హీట్ రోజురోజుకు పెరిగిపోతోంది. ఇది రాబోయే రోజుల్లో మరింత పీక్‌కు చేరే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్నికల ఫీవర్ నేపథ్యంలో నేతల యాత్రలు కూడా ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

యాడికి : మండలంలోని కూర్మాజిపేట గ్రామానికి చెందిన విజయ్ (24) ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. విజయ్ తన భార్య పూజితతోపాటు తల్లిదండ్రులతో కలిసి కుర్మాజీపేటలో నివాసం ఉంటున్నాడు. భార్య మూడు నెలల గర్భవతి. దీంతో ఆమె తన పుట్టింటికి వెళ్లింది. అయితే ఆమె పుట్టింటికి వెళ్లినప్పటి నుంచి వేరు కాపురం పెట్టాలని అత్తింటికి రాలేదు. ఈ విషయం కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక మదనపడి ఆవేశంలో శుక్రవారం రాత్రి తన ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం గమణించిన తల్లిదండ్రులు బోరున విలపించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందివ్వడంతో వారు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని తండ్రి గంగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : మండలంలోని వన్నెదొడ్డి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దవడగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన మనోజ్ పని నిమిత్తం స్థానిక మండలం కరిడికొండ గ్రామానికి వెళ్లి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. వన్నెదొడ్డి గ్రామం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దుప్పట్ల పంపిణీ, అన్నదానం

అన్నదానం చేస్తున్న సత్యనారాయణ కుటుంబ సభ్యులు

రాయదుర్గం : పట్టణంలోని ప్రముఖ మిఠాయి వర్తకులు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు రేకులకుంట సత్యనారాయణ కుమారుడు సాయి సూర్యగణేష్ నీట్ పరీక్షలో జాతీయస్థాయి ర్యాంకు సాధించడంతో శనివారం ఆయన స్వగృహం వద్ద పేదలకు అన్నదానం చేశారు. అనంతరం దుప్పట్లు పంపిణీ చేశారు. గణేష్ నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచి హైదరాబాదులోని ఇఎస్ఐ ఆసుపత్రి కళాశాలలో మెడిసిన్ సీటు ప్రవేశం పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జయంతి సురేష్‌కుమార్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు శ్రీనివాసులు, ధనార్జన, సత్యనారాయణ, ఉమామహేశ్వరయ్య, శంకర్‌బాబు, వెంకటరమేష్, మోహన్, డాక్టర్ షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

మండల బీసీ సెల్ అధ్యక్షులుగా చంద్ర

డి.హీరేహాల్ : మండల వైసిపి బీసీ సెల్ అధ్యక్షుడిగా పులకుర్తి చంద్రను ఏకగ్రీవంగా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బీసీ సెల్ అధ్యక్షునిగా ఎంపిక చేసినందుకు విప్ రామచంద్రారెడ్డి, మండల కన్వీనర్ వన్నూర్‌స్వామికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు తపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీకోసం పని చేస్తానన్నారు.

4న వాహనాల బహిరంగ వేలం

అనంతపురం క్రైం : వివిధ ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన పలు వాహనాలను అనంతపురం సెబ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సెబ్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ ఇన్స్‌పెక్టర్ ఆర్.రవిచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.3వేల ధరావతు రుసుం చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

'గేట్స్' కరస్పాండెంట్‌కు సన్మానం



గేట్స్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మను సన్మానిస్తున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

గుత్తి : గేట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల) కరస్పాండెంట్ వీకే. పద్మావతమ్మను సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. గేట్స్ కళాశాలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ హోదా రావడాన్ని హర్షిస్తూ కరస్పాండెంట్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్.కవిత, ఎన్.రేణుక, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి సీనియర్ నాయకుడు మృతి

గుత్తి : మండలంలోని ఇసురాళ్లపల్లికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు బొర్రా పెద్ద నాగిరెడ్డి (65) శనివారం అనారోగ్యంతో మరణించారు. గ్రామానికి చెందిన నాగిరెడ్డి, అతని కుమారుడు బొర్రా పుల్లారెడ్డి వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుగ్గా పనిచేశారు. నాగిరెడ్డి మరణం విషయం తెలుసుకున్న సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు బేడల వెంకటరాముడు, మాజీ జడ్పిటిసి ప్రవీణ్‌కుమార్ యాదవ్, తదితరులు గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సర్పంచి వాసుదేవరెడ్డి, కౌన్సిలర్ నరేష్, నాయకులు ఎం.రంగస్వామి, విశ్వనాథ్‌రెడ్డి మల్లికార్జున, చంద్ర తదితరులు ఉన్నారు.

నేడు అనంతలో బలిజల వనమహోత్సవం



మాట్లాడుతున్న రాయలసీమ బలిజ మహిళా సంఘం అధ్యక్షురాలు పద్మజ

అనంతపురం : రూరల్ పరిధిలోని తడకలేరు అశ్వర్థ నారాయణ స్వామి వద్ద ఏర్పాటు చేసిన కార్తీక వనమహోత్సవానికి బలిజ మహిళలంతా తరలి రావాలని రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షులు పాముగాయి వెంకటేశ్వర్లు, అధ్యక్షురాలు గాజుల పద్మజ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ఆమె స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 15 రోజులుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చైతన్యం తీసుకొచ్చేలా విస్తృతంగా పర్యటించామన్నారు. పాతూరు, తపోవనం నుంచి ప్రత్యేక బస్సులు మహిళల కోసం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు భారతి, శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పవర్ గ్రిడ్ ఏర్పాటుకు సహకరించండి : జెసి

గుంతకల్లు : మండలంలోని తిమ్మాపురం, దోనిముక్కల గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేయనున్న పవర్‌గ్రిడ్ నిర్మాణానికి భూసేకరణ సేకరణ కోసం రైతులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ కోరారు. శనివారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలోని ఆర్డీఓ ఛాంబర్‌లో ఆర్‌డిఒ శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఆయా గ్రామాల రైతులతో పవర్ గ్రిడ్ నిర్మాణానికి అవసరమైన భూమి ధరలపై సంప్రదింపులు చేశారు. రైతులకు నష్టం రాకుండా సరైన ధర అందేలా చూస్తామని జెసి తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ బి.రాము ఉన్నారు.

ఎస్.గూడూరులో డీఎస్పీ పర్యటన

గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి

పుట్లూరు : మండల పరిధిలోని ఎస్.గూడూరు గ్రామంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి శనివారం పర్యటించారు. గ్రామంలో నాలుగు నెలల క్రితం ఎస్సీ, ఓసీల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న విషయం విధితమే. ఈనేపథ్యంలో డీఎస్పీ గ్రామంలో పర్యటించి ఇరువర్గాలతో సమావేశపరిచి చర్చించారు. గ్రామంలో గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ దిలీప్‌కుమార్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

గుత్తి : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బంజారా ఫౌండేషన్ చైర్మన్ కమల్‌సింగ్ రాథోడ్ పిలుపునిచ్చారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో ఉన్న సేవాఘడ్ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయం వద్ద శనివారం బంజారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బంజారా ఫౌండేషన్ సభ్యులు తారాచంద్, లతా రాథోడ్, పారుపుక్కుల సంఘం సభ్యురాలు పద్మిని భాయి, శర్మన్ చౌహాన్, రాజేష్, రవితేజ పాల్గొన్నారు.

ఉరవకొండ ఎంపిపికి సన్మానం

ఉరవకొండ : నూతనంగా ఎంపికైన మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు వెలుగొండ నరసింహులును శనివారం స్థానిక ఎంపిపి కార్యాలయంలో బంగారు షాప్ నిర్వాహకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ మహల్ బంగారు షాప్ నిర్వాహకులు సోమశేఖర్, మేటి బసవరాజు, వీరు, మాజీ జడ్పిటిసి తిప్పయ్య, వైసిపి పార్టీ నాయకులు ఉల్లిగప్ప పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

గుత్తి : మండలంలోని బేతాపల్లిలో ఉన్న జడ్పి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మహాలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలత దేశ తొలి రాష్ట్రపతి బాబూరాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం 12 మంది దివ్యాంగ విద్యార్థులకు రాఘవేంద్ర బుక్‌స్టాల్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబులపతి, సాధన, శివప్రసాద్, రవీంద్రనాథ్‌రెడ్డి, నరేంద్ర, సుజాత, రామకృష్ణ, రత్నకుమారి, మాధన్న తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు

బెలుగుప్ప : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను వైసీపీ మండల నాయకుడు పురుషోత్తంరాజు సొంత ఖర్చులతో శనివారం జెసిబి ద్వారా తొలగించారు. దీంతో ఎంఇఒ మల్లారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటప్రసాద్, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు రాజశేఖర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ విగ్రహ ఏర్పాటును నిరసిస్తూ ఆందోళన

అనంతపురం కలెక్టరేట్ : రూరల్ పరిధిలోని చంద్రబాబు కొట్టాల మెయిన్ రోడ్డులో రాత్రికి రాత్రి వైఎస్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ టిడిపి, జనసేన, సిపిఐ నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రుద్రంపేట టిడిపి నాయకులు కుమార్‌నాయుడు, సిపిఐ నాయకులు అల్లీపీరా మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి వద్ద అర్ధరాత్రి విగ్రహం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకారుల వద్దకు చేరుకుని చర్చించి ధర్నాను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న నాయకులు

ఓటు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-గార్లదిన్నె

గార్లదిన్నెలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న తహశీల్దార్ ఉషారాణి

18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహశీల్దార్ ఉషారాణి సూచించారు. శనివారం మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను తహశీల్దార్ పరిశీలించారు. ఇందులో భాగంగా కొత్తగా ఓటు కోసం 76 మంది దరఖాస్తు చేసుకోగా, తొలగించేందుకు 17, సవరణల కోసం 13 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఒలు పాల్గొన్నారు.

రాయదుర్గం : కణేకల్ మండలంలోని సొల్లాపురం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని రాయదుర్గం అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి ఎస్.కరుణకుమారి శనివారం పరిశీలించారు. అలాగే రాయదుర్గంలోని పోలింగ్ కేంద్రంలోని 184, 185 సెంటర్లను కళ్యాణదుర్గం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ వరప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాత తనిఖీ చేశారు.

పీపుల్స్ నాయకులు బండయ్య భార్య పక్కీరమ్మ మృతికి నివాళి

ఉరవకొండ : దివంగత పీపుల్స్ వార్ నాయకులు బండయ్య మాస్టర్ భార్య పక్కీరమ్మ (90) శనివారం మృతిచెందడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి చాబాల గ్రామానికి చేరుకుని నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో చంద్ర, సర్పంచి జగదీష్, డోనేకల్ రమేష్, నారాయణప్ప, గోవర్ధన్, చక్రిస్వామి, మోహన్, రామచంద్ర, మల్లేష్, సూరి, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బాల్య వివాహాల నివారణపై అవగాహన

రాయదుర్గం రూరల్ : స్థానిక దుర్గాదేవి మహిళా మండలి సమాఖ్య కార్యాలయంలో ఏరియా కోఆర్డినేటర్ గంగాధర్ ఆధ్వర్యంలో శనివారం బాల్య వివాహాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమంలో భాగంగా నాలుగు వారాలపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మొదటివారం లింగ వివక్షత, రెండవ వారం బాల్య వివాహాల నివారణ, మూడోవారం రక్తహీనత, నాలుగో వారం బాలికల విద్యపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. డిసెంబర్ 23వతేదీ వరకూ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు లలిత, సీ.సీ, విఒఎలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రొఫెషనల్స్ డే

శింగనమల : మండల పరిధిలోని చిన్నమట్ల గొంది సమీపంలో ఉన్న సంజీవరాయ విద్యానికేతన్ పాఠశాలలో శనివారం ప్రొఫెషనల్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయులు మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం సమయంలో నలుగురు విద్యార్థులతో ప్రారంభమై నేడు 300 మందితో నడుపుతున్నట్లు తెలిపారు. పాఠశాలలో తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు పూర్తిగా ఉచిత విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ఇలా దాదాపుగా 15 మంది అనాథ విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఎవరైనా తల్లిదండ్రులు చనిపోయిన అనాథ పిల్లలు ఉంటే తమ పాఠశాలలో చేర్పాలని కోరారు. ఎంతో నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-ఉరవకొండ

మాట్లాడుతున్న ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి

మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు సూచించారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు విద్య, వైద్యం, వ్యవసాయ, గృహ నిర్మాణం, రెవెన్యూ, విద్యుత్, ఉపాధి హామీ వంటి వివిధ శాఖలకు సంబంధించిన పలు అంశాలను లేవనెత్తారు. అనంతరం ఎంపిపి, జడ్పిటిసి మాట్లాడుతూ వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని, అధికారులు ఇదే ధోరణిలో ఉంటే ప్రజలు ఇబ్బందులకు గురవుతారన్నారు. ఇకనైనా మొద్దనిద్ర వీడి బాధ్యతగా పనిచేయాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి సత్యబాబు, వైస్ ఎంపిపి రాకెట్ల పుష్పావతి భీమ్‌రావు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి కంపెనీలపై తనిఖీలు

అనంతపురం : జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.మునిరామయ్య ఆదేశాల మేరకు నగరంలోని పాల డెయిరీలు, పాల ఉత్పత్తి కంపెనీల్లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా రికార్డులను తనిఖీ చేసి, నాణ్యత పరీక్షల కోసం నమూనాలను (శాంపుల్స్) సేకరించి ల్యాబ్‌కు పంపారు. నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పి.సాయిప్రసాద్, వి.వెంకటరమణ, ఎం.రామారావు, డి.విజయలక్ష్మి, శేషగిరి, జి.జయపాలరెడ్డి, టి.రాజశేఖర్, రవీంద్రనాథ్, టి.కుళ్లాయిరెడ్డి, పి.తస్లీమ, తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఘనంగా శర్మస్‌వలి ఉరుసు

బొమ్మనహాళ్ : మండలంలోని దర్గాహొన్నూరులో వెలసిన షర్మస్‌వలి ఉరుసు మహోత్సవం శనివారం ఘనంగా సాగింది. ఇందులో భాగంగా భక్తులు దర్గాను గల్ఫ్ నుంచి తెచ్చిన పూలతో అలంకరించారు. భక్తులు చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు భారీగా తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిఐ యుగంధర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు, సర్పంచి యశోదమ్మ, ఎంపిటిసి శ్రీదేవి, తదితరులు పాల్గొని పూజలు చేశారు.

'థ్యాంక్యూ సీఎం సార్'...

జగన్‌ను కలిసిన ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డి

శింగనమల : మండలంలోని నాయనవారిపల్లి వద్ద శింగనమల పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు కేటాయించడాన్ని హర్షిస్తూ సిఎం జగన్‌కు ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు సిఎం క్యాంపు కార్యాలయంలో సిఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మండలానికి భారీ ప్రాజెక్టు మంజూరు చేయడంతో తమ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని, అందుకు ఎంతో రుణపడి ఉంటామని తెలిపారు.

బీమా తక్షణసాయం అందజేత

ఉరవకొండ : పట్టణంలోని 11వ వార్డులో నివాసం ఉంటున్న ముల్లాషాను శుక్రవారం గుండెపోటుతో మృతిచెందింది. దీంతో శనివారం వైఎస్ఆర్ బీమా పథకంలో భాగంగా తాత్కాలిక ఉపశమనం కింద నామినీ తాజుద్దీన్‌కు రూ.10 వేలు తక్షణసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లలిత, నాయకులు బసవరాజు, తాజు, సచివాలయం-2 వెల్ఫేర్ అసిస్టెంట్ రేఖ, వాలంటీర్ భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కడవకల్లులో బండారు శ్రావణిశ్రీ పర్యటన

ప్రజాశక్తి-పుట్లూరు

మహిళలతో మాట్లాడుతున్న బండారు శ్రావణిశ్రీ

మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ శనివారం పర్యటించారు. ఇందులో భాగంగా నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపు కోసం కష్టపడాలని సూచించారు. అనంతరం రామాంజనేయులు నూతన గృహ ప్రవేశానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడవకల్లు గోవర్ధనరాజు, నాగేశ్వర్‌రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఎబిజిఇ సంఘం రాయలసీమ సదస్సు

అనంతపురం కలెక్టరేట్ : రాయలసీమ గిరిజన ఉద్యోగులు, గిరిజన సంఘాల నాయకులతో ఆదివారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.అశోక్‌నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.రామానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో అవమానాలు ఎదుర్కొంటున్న గిరిజన ఉద్యోగులు, గిరిపుత్రుల వెతలు, బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితా చేర్చే అసెంబ్లీ తీర్మానం ప్రభావాలు అనే అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కావున రాయలసీమ జిల్లాలు తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, నంద్యాల, కర్నూలు, శ్రీసత్యసాయి, అనంతపురం నుంచి గిరిజన కార్యకర్తలు, ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక విద్యార్థి సంఘం నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

డ్రిప్పు దొంగలు అరెస్టు

నార్పల : మండల పరిధిలోని రైతుల పొలాల్లో రెండు రోజుల క్రితం డ్రిప్పు పైపులు దొంగతనం చేసిన నిందితులను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. నలుగురు దొంగలను పట్టుకుని 50 కట్టల డ్రిప్పు పైపులు, 160 మీటర్ల కేబుల్ వైరు, ఒక టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా కేసేపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం చోరీ చేసిన పట్టుచీరలను నిందితులు వీరిలను పడేసి వెళ్లారు.